క్లుప్తంగా

33 మందికి కొవిడ్‌ టెస్టులు

పటాన్‌చెరు టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 33 మందికి కొవిడ్‌ ర్యాపిడ్‌ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్‌ వచ్చిందని వైద్యసిబ్బంది మనోహర్‌ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్‌ టెస్టులు 27మందికి నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

రంగనాయకస్వామి కల్యాణం



మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్‌ చెరువుకట్ట సమీపంలో శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన చేశారు. ఈ నెల 15వ తేదీ తులసిదళార్చన తదితర పూజలు ఉంటాయన్నారు.

'మెషిన్‌ లెర్నింగ్‌'పై అవగాహన సదస్సు

పటాన్‌చెరు టౌన్‌: గీతం స్కూల్‌ ఆఫ్‌ టెక్నాలజీలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26, 28 తేదీల్లో 'మెషిన్‌ లెర్నింగ్‌ ఇట్స్‌ అప్లికేషన్స్‌ ఇన్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ' అనే అంశంపై 3 రోజుల అధ్యాపక వికాసంపై అవగాహన సదస్సు (ఎఫ్‌ఎపీ) నిర్వహించనున్నట్టు ప్రొఫెసర్‌ మాధవి, ప్రొఫెసర్‌ మంజునాథాచారి సోమవారం సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. మెషిన్‌ లెర్నింగ్‌ అల్గారిథమ్‌లను ఇంజనీరింగ్‌, టెక్నాలజీకి ఎలా అన్వయించవచ్చో అర్థం చేసుకోవడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో పాల్గొనే వారిని సన్నద్ధం చేయడానికి దీనిని రూపొందించినట్టు తెలిపారు. ఈఎఫ్‌ఎపీని విద్యావేత్తలు, పరిశోధన స్కాలర్లు, బీటెక్‌, ఎంటెక్‌, ఎమ్మెస్సీ చదివే వారికోసం ఉద్దేశించామని, ఆసక్తి ఉన్నవారు ఇతర వివరాలకు డాక్టర్‌ రామకృష్ణ 81060 21619ని సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి చూసి బీజేపీలో చేరుతున్నారు



బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న నాయకులు రవికుమార్‌యాదవ్‌

గచ్చిబౌలి: ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీజేపీలో చేరుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్‌ పేర్కొన్నారు. మియాపూర్‌ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు రాజేష్‌గౌడ్‌, శంకరయ్య, శ్రీనివాస్‌గౌడ్‌, సాగర్‌గౌడ్‌ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు సోమవారం బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి


భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌యంటీ శాతవాహననగర్‌లో కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు సోమవారం పర్యటించారు. రూ. 33 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న టిప్పర్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆగిఉన్న ఆర్టీసీ బస్సును టిప్పర్‌ ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హకీంపేట్‌ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళుతోంది. రామచంద్రాపురం వద్ద ఓ లారీ యూటర్న్‌ తీసుకుంటుంది. ఆ సమయంలో బస్సు డ్రైవర్‌ సత్యనారాయణ బస్సును ఆపాడు. ఈ క్రమంలో ఆగిఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్‌ బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌ సత్యనారాయణ, కండక్టర్‌ వినోద్‌లు గాయాలపాలయ్యారు. టిప్పర్‌ డ్రైవర్‌ పప్పురాంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌.. జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్‌ డ్రైవ్‌లో 24 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా వారికి జరిమానా విధించారు. 22 మందికి రూ.2 వేల చొప్పున, ఒకరికి రూ. 3వేలు, మరొకరికి రూ.5 వేలు విధించారన్నారు.



రాయదుర్గం వ్యూ

రాయదుర్గం..అభివృద్ధి పథం

రాయదుర్గం: తెలంగాణ ఏర్పడిన అనంతరం రాయదుర్గంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. పెరిగిన జనాభా, విస్తరించిన బస్తీలు, కాలనీలతో సమస్యలు కూడా పెరుగుతూనే ఉన్నాయి. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డిలు అభివృద్ధికి తగు చర్యలు చేపడుతున్నారు. కాగా గ్రామ పంచాయతీ కాలం నుంచే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగు నీటి పైప్‌లైన్‌లు ఉన్న ప్రాంతంగా రాయదుర్గంకు పేరుంది. కాగా పూర్వం ఈ ప్రాంతాన్ని పలు రకాలుగా పిలిచేవారు. నిజాంకాలంలో హుస్సేన్‌ షావలీ దర్గా అని, ఆ తర్వాత రాయదుర్గ్‌ అని, కొందరు దర్గా అని, రాయదుర్గం అని పిలుస్తుంటారు. స్థానికంగా సుమారు 15వేల జనాభా ఉంటుంది.

రాయదుర్గంలో.. దక్షిణాదిలోనే అత్యాధునిక వైకుంఠ మహాప్రస్థానం, రాష్ట్రంలోనే ఏకైక ఫుట్‌వేర్‌ డిజైన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఇన్‌స్టిట్యూట్‌, గవర్నమెంట్‌ లెదర్‌ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌ (జీఎల్‌ఐటీ), ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, పట్టణ ఆరోగ్య కేంద్రం, రైతుల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం , ఉర్దూ మీడియం జెడ్పీహెచ్‌ఎస్‌, తెలుగు మీడియం జెడ్పీహెచ్‌ఎస్‌, ప్రాథమిక పాఠశాలలున్నాయి.



రాత్రివేళ మల్కంచెరువు పరిసరాల అందాలు



అందుబాటులోకి వచ్చిన రాయదుర్గం-ప్రశాసన్‌నగర్‌ లింకురోడ్డు ఇదే ..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక..

- రూ.333 కోట్లతో రాయదుర్గం ప్రధానరోడ్డు ఫ్లైఓవర్‌
- రూ.30 కోట్లతో మల్కంచెరువు అభివృద్ధి
- రూ.10 కోట్లతో ప్రశాసన్‌నగర్‌ రోడ్డు నిర్మాణం
- రూ.8 కోట్లతో మల్కంచెరువు- చిత్రపురి కాలనీ మీదుగా ఖాజాగూడకు లింకురోడ్డు
- రూ.6 కోట్లతో సీసీరోడ్లు, బీటీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి పైప్‌లైన్‌ నిర్మాణం
- రూ.76 లక్షలతో రాయదుర్గం-పంచవటి కాలనీ రోడ్డులో బుల్కాపూర్‌ నాలాపై బ్రిడ్జి
- రూ.60 లక్షలతో మల్కంచెరువు వద్ద గణేశ్‌ నిమజ్జన కోనేరు నిర్మాణం
- రూ.3.5 కోట్ల వ్యయంతో ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణం
- రూ.1.50 కోట్లతో జెడ్పీహెచ్‌ఎస్‌, ప్రాథమిక పాఠశాలల్లో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన

ప్రధాన సమస్యలు.. డిమాండ్లు

- రాయదుర్గం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉన్నా విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ మాత్రం షేక్‌పేట్‌ పరిధిలో కొనసాగడంతో గచ్చిబౌలి డివిజన్‌ పరిధిలోకి మార్చాలని ప్రజల డిమాండ్‌
- కోఠి నుంచి రాయదుర్గం వార్డు కార్యాలయం వరకు కొనసాగి.. ఆగిపోయిన ఆర్టీసీ బస్సు సౌకర్యం
- బుధవారం సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం, మౌలిక వసతులు కల్పించాలి
- బీసీలు, ఎస్సీల శ్మశానవాటికలలో సౌకర్యాలు
- మూతపడ్డ జిల్లా గ్రంథాలయ సంస్థను తిరిగి అందుబాటులోకి తేవాలి
- వెంకటేశ్వరస్వామి కమాన్‌ నుంచి ఆలయం వరకు ప్రధానరోడ్డు పునరుద్ధరణ
- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత భవన నిర్మాణం, 30 బెడ్లతో ఆధునీకరించాలనే డిమాండ్లు ఉన్నాయి.

దశలవారీగా సమస్యల పరిష్కారం



రాయదుర్గంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం. అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తున్నాం. ప్రధానరోడ్డులో ఫ్లైఓవర్‌ అందుబాటులోకి వచ్చింది. శ్మశాన వాటికల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక రూపొందించాం. మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తాం.

–గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్‌, గచ్చిబౌలి డివిజన్‌

ప్రగతిని వివరించేందుకే దశాబ్ది ఉత్సవాలు



ఖాజాగూడ పెద్ద చెరువు వద్ద జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రం పదేళ్ళలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేందుకే దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం జరుగుతోందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలోని పెద్ద చెరువు వద్ద తెలంగాణ రన్‌ (2కెరన్‌)ను సోమవారం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌ మహేష్‌, పోలీసుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాంధీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రోజులపాటు అంతటా పండుగ వాతావరణం నెలకొంటుందన్నారు. శేరిలింగంపల్లి రూపురేఖలు మారిపోయేలా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీనివాస్‌యాదవ్‌, నాయకులు, కార్యకర్తలు, రాయదుర్గం పోలీసులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్‌: చందానగర్‌ అపర్ణ హిల్‌ పార్కు వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కె రన్‌ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ, మాదాపూర్‌ డీసీపీ శిల్పవల్లి, మియాపూర్‌ ఏసీపీ నర్సింహారావులు హాజరై 2కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మియాపూర్‌ సీఐ తిరుపతిరావు, చందానగర్‌ సీఐ క్యాస్ట్రోరెడ్డి, కార్పొరేటర్‌ జగదీశ్వర్‌గౌడ్‌, చందానగర్‌ డివిజన్‌ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, మాదాపూర్‌ డివిజన్‌ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ శంకరయ్య

గచ్చిబౌలి: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ శంకరయ్య అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హరితహారం, మోడల్‌ కారిడార్స్‌, జంక్షన్ల అభివృద్ధి, ఫుట్‌పాత్‌లు, థీమ్‌ పార్కుల నిర్మాణ పనులపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం విజయవంతం చేయడానికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌ పరిధిలో చేపట్టిన మోడల్‌ కారిడార్ల పనులను వేగవంతం చేయాలన్నారు. వెస్ట్‌జోన్‌ పరిధిలో ఇప్పటికే ఆరంభించిన థీమ్‌ పార్కుల నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో వెస్ట్‌జోన్‌ జోనల్‌ జాయింట్‌ కమిషనర్‌ మల్లారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు వెంకన్న, సుధాంష్‌, బాలయ్య, రమేష్‌, ఇంజనీరింగ్‌, టౌన్‌ ప్లానింగ్‌, యూబీడీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్‌ కమిషనర్‌ శంకరయ్య

మొక్కలు నాటాలి.. పెంచాలి



ప్లాంటేషన్‌ డ్రైవ్‌ ప్రారంభోత్సవంలో వీసీ ఐనుల్‌ హసన్‌ తదితరులు

రాయదుర్గం: చెట్లు నరికివేస్తే రాబోయే తరాలు ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారుతుందని, ఆక్సిజన్‌ సిలిండర్లను వెంట తీసుకెళ్లే పరిస్థితి వస్తుందని మనూ వీసీ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ అన్నారు. మన మనుగడకు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో సోమవారం జల్‌ శక్తి అభియాన్‌ కమిటీ ఆధ్వర్యంలో ప్లాంటేషన్‌ డ్రైవ్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లోని ప్రొఫెసర్స్‌ క్వార్టర్స్‌లోని చెరువు వద్ద మొక్కలు నాటారు. అంతకుముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్విజ్‌, పెయింటింగ్‌, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కర్నూలు డాక్టర్‌ అబ్దుల్‌ హక్‌ యూనివర్శిటీ వీసీ ప్రొఫెసర్‌ ఎఫ్‌ రహమాన్‌ జల్‌శక్తి కమిటీ చైర్మన్‌ ప్రొఫెసర్‌ షకీల్‌ అహ్మద్‌, కన్వీనర్‌ ప్రొఫెసర్‌ మహ్మద్‌ ఫరియాద్‌ , ప్రొఫెసర్లు అబ్దుల్‌ వాహిద్‌ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

పటాన్‌చెరు టౌన్‌: వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందారు. పాశమైలారం పారిశ్రామిక వాడలో ఆర్‌వీ ఇంజనీరింగ్‌ పరిశ్రమలో శనివారం పేలుడు కారణంగా రమణారెడ్డితో పాటు సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, వెంకటేశ్వరరావు, సతీష్‌రెడ్డిలు ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను సోమవారం పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరో ఘటనలో మహిళ...

పటాన్‌చెరు ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..కొత్తగూడెం గ్రామానికి చెందిన గణేశ్‌ అతని భార్య వరలక్ష్మి(35) మే 4వ తేదీన సాయంత్రం ఊరి నుంచి పటాన్‌చెరు వైపు బైక్‌పై వస్తుండగా ఇంద్రేశం వద్ద వెనుకనుంచి టిప్పర్‌ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వరలక్ష్మిని హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

మనూలో జాబ్‌ ఫెయిర్‌

రాయదుర్గం: విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ పేర్కొన్నారు.సోమవారం ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ట్రెనింగ్‌ అండ్‌ ప్లేస్‌మెంట్‌ సెల్‌, గ్యాలెక్సీ ప్లేస్‌మెంట్‌ సర్వీసెస్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ముస్లిం ప్రొఫెషనల్స్‌(ఏఎంపీ) ఆధ్వర్యంలో ప్రత్యేక మెగా జాబ్‌ మేళాను ఆయన ప్రారంభించారు. టీపీసీ ఇన్‌చార్జీ డాక్టర్‌ ఎండీ యూసుఫ్‌ఖాన్‌ మాట్లాడుతూ 58 కంపెనీలు జాబ్‌ మేళాలో పాల్గొన్నాయన్నారు.

నేడు యోగాపై సెమినార్‌

రాయదుర్గం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మనూలోని ఎన్‌ఎస్‌ఎస్‌ సెల్‌ ఆధ్వర్యంలో మంగళవారం సెమినార్‌ నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ మహ్మద్‌ ఫరియాద్‌ తెలిపారు. క్యాంపస్‌లోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో మధ్యాహ్నం 12 గంటలకు వీసీ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

గచ్చిబౌలి: గచ్చిబౌలి, కొండాపూర్‌ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్‌ ఆధ్వర్యంలో పలువురు నాయకులు జోనల్‌ కమిషనర్‌ శంకరయ్య, డిప్యూటీ కమిషనర్‌ వెంకన్న, ఇంజనీరింగ్‌ అధికారులకు వినతిపత్రాలను సోమవారం సమర్పించారు. గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో ఆయా డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో ప్రజల నుంచి వచ్చిన డిమాండ్లు, సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నామని వాటిని పరిష్కరించాలని వారు అధికారులను కోరారు. అనంతరం జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ గచ్చిబౌలి, కొండాపూర్‌ డివిజన్లలో బీఆర్‌ఎస్‌ నాయకులు కబ్జాలు, వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాలనీలు, బస్తీలలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చామని, వాటికి వారు సానుకూలంగా స్పందించారన్నారు.

నేటి నుంచి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

పటాన్‌చెరు టౌన్‌: 15 ఏళ్లుగా కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని, ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో సీఐటీయూ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జీఓల కాలపరిమితి ముగిసినప్పటికీ వాటిని సవరించకపోవడం దారుణమన్నారు. నేడు అన్ని రకాల నిత్యావసరాల ధరలు పెరిగినందునా ప్రభుత్వం కార్మికులకు వేతనాలు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. కాలపరిమితి ముగిసిన అన్ని జీవోలను ప్రభుత్వం తక్షణమే సవరించాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 12 నుంచి జూలై 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఆందోళనల కార్యక్రమాల్లో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, నరసింహారెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీధర్‌, సుధాకర్‌ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ఘనంగా తెలంగాణ రన్‌

పటాన్‌చెరు: రాష్ట్ర అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఇక్రిశాట్‌ నుంచి పటాన్‌చెరు మైత్రి మైదానం వరకు తెలంగాణ రన్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అన్ని రంగాల్లో తెలంగాణ యువత మెరుగైన ప్రతిభ కనబరుస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు 2017, 2022లో తన సొంత నిధులతో ఉచిత పోలీస్‌ శిక్షణ అందించగా 500 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్‌ వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌ యాదవ్‌, పుష్పనగేష్‌, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎస్పీ భీంరెడ్డి, సీఐలు వేణుగోపాల్‌రెడ్డి, వినాయక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి లాలునాయక్‌, ప్రవీణ్‌రెడ్డి, వేణుకుమార్‌, శ్రీనివాసులురెడ్డి ఎస్‌ఐలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల బైక్‌ ర్యాలీ

గచ్చిబౌలి: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కొండాపూర్‌ టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో బైక్‌ ర్యాలీ నిర్వహించారు. సోమవారం బెటాలియన్‌ క్యాంపస్‌లో కమాండెంట్‌ పి.మురళీకృష్ణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కొత్తగూడ జంక్షన్‌ వరకు, అక్కడి నుంచి బెటాలియన్‌ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో అదనపు కమాండెంట్‌ టీఎస్‌ సింగ్‌, సహాయ కమాండెంట్లు నరసింహ, సత్యనారాయణ, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

బొటానికల్‌ గార్డెన్‌లో..

కొత్తగూడలోని బొటానికల్‌ గార్డెన్‌లో సోమవారం గచ్చిబౌలి సీఐ గోనె సురేష్‌ ఆధ్వర్యంలో 4కె పోలీస్‌ రన్‌ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పోలీస్‌ విభాగానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బొటానికల్‌ గార్డెన్‌ వాకర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు భరత్‌రెడ్డి, డీఐ రవీందర్‌, ఎస్‌ఐలు శోభన్‌బాబు, సురేందర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, సిబ్బంది, వాకర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.



కొండాపూర్‌ టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్‌ పోలీసుల ర్యాలీ

ఆలయాల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ప్రార్థనా మందిరాలు, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీనివాసనగర్‌ కాలనీలో మెథడిస్ట్‌ చర్చి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఆర్‌ సంస్థ సహకారంతో చర్చి నిర్మాణానికి రూ.70లక్షల నిధులను మంజూరు చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 170కి పైగా దేవాలయాలతో పాటు చర్చిలు, మసీదులు, దర్గాలు నిర్మించినట్టు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ పుష్పనగేష్‌, జిల్లా పరిషత్‌ వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పరమేష్‌యాదవ్‌, తొంట కృష్ణాకాంత్‌, చర్చి ప్రతినిధులు శామ్యూల్‌ విన్సెయ్‌కుమార్‌, ప్రశాంత్‌ పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభం



ద్విచక్ర వాహనాలపై పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలు తెరుచుకున్నాయి. మండల పరిధిలో 12 జిల్లా పరిషత్‌ హైస్కూల్స్‌, 3 ప్రాథమికోన్నత, 44 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఉదయం 7 గంటల నుంచే ప్రైవేట్‌ స్కూల్‌ బస్సులు రోడ్లపైకి వచ్చాయి. తల్లిదండ్రులు వాహనాలపై పిల్లలను స్కూల్స్‌కు తీసుకువెళ్లడం, బస్సులు, ఆటోలతో రోడ్లు రద్దీగా మారాయి.



స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

